నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR

## 27న ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు




కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : మెదక్- నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ నెల 27న ప్రభుత్వోద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ సెలవు వర్తిస్తుందని చెప్పారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాటు ఇవ్వాలని సూచించారు. ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు, డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరుకావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

# ఆర్టీసీ చార్జీల మోత!

- ప్రత్యేక బస్సుల పేరిట భారీగా పెంపు
- మహా శివరాత్రి సందర్భంగా 50 శాతం అదనంగా వసూలు
- ప్రయాణికుల్లో అసంతృప్తి




ప్రయాణికులపై ఆర్టీసీ చార్జీల మోత మోగించబోతున్నది. ప్రత్యేక బస్సుల పేరిట భారీగా పెంచబోతున్నది. మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలకు నడిపే బస్సుల్లో నేటి నుంచి 50 శాతం అదనంగా వసూలు చేసేందుకు సిద్ధమవుతుండగా, ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

కరీంనగర్ తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నది. కరీంనగర్ జోన్ పరిధిలోని కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్ రీజయన్లలోని ప్రతి డిపో నుంచి దక్షిణకాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడకు ప్రత్యేక బస్సులు నడిచేలా ఏర్పాట్లు పూర్తిచేసింది. అంతే కాకుండా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన కాళేశ్వరం, వేలాల, దుబ్బరాజన్న, పొట్లపల్లి దేవాలయాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. అయితే, ఈ ప్రత్యేక బస్సుల్లో రెగ్యులర్ బస్ టికెట్ చార్జీ కన్నా వన్ అండ్ ఆఫ్ ఫేర్ చార్జీని అదనంగా వసూలు చేసేందుకు సిద్ధమైంది. దీంతో ప్రయాణికులపై అదనపు భారం పడనున్నది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మంచిర్యాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు లక్షలాదిగా వేములవాడతోపాటు ఇతర పుణ్యక్షేత్రాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారి అవసరాన్ని ఆసరగా తీసుకుంటున్న ఆర్టీసీ ముఖ్యమైన పండుగ రోజుల్లో అదనపు చార్జీలను వసూలు చేస్తూ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నది.

### ప్రయాణికుల సౌకర్యార్థమే ప్రత్యేక బస్సులు

మహా శివరాత్రి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసమే ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నాం. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడకు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు రానున్నారు. రెగ్యులర్ బస్సులతోపాటు ప్రత్యేక బస్సులను నడించేలా అన్ని చర్యలూ తీసుకున్నాం. ప్రత్యేక సందర్భాల్లో నడిపించే బస్సుల్లో ప్రయాణించేందుకు రెగ్యులర్ బస్సు టికెట్‌లో వన్ అండ్ ఆఫ్ ఫేర్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేక బస్సులు ప్రయాణికులను గమ్యస్థానంలో చేర్చి, ఓఆర్ తక్కువ ఉన్నా తిరిగి వస్తాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా డీఎంల పర్యవేక్షణలో బస్సులను నడిపిస్తాం. రద్దీని బట్టి మరిన్ని బస్సులను నడిపించేలా ఏర్పాట్లు చేశాం.

- రాజు, ఆర్ఎం (కరీంనగర్)

### పెంపు ఇలా?

కరీంనగర్ నుంచి వేములవాడకు రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ టికెట్ ధర ₹50 ఉండగా, ప్రత్యేక బస్సులో ₹80 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా జోన్ పరిధిలోని ఆయా డిపోల నుంచి వెళ్లే బస్సుల్లో ప్రస్తుత టికెట్ కంటే అదనంగా 50 శాతం వసూలు చేయనున్నారు. తిరుగు ప్రయాణంలోనూ ఇవే చార్జీలు ఉండనున్నాయి. ఈ ధరలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో అమలు కానున్నాయి. అయితే గతంలో టికెట్ ధర అదనంగా చెల్లించినా సరిపడా బస్సులు లేక, సీట్లు దొరకక ప్రయాణికులు అవస్థలు పడ్డ సందర్భాలున్నాయి.

# యూరియా కొరతనా.. అంచనా తప్పిదమా..?





తిమ్మాపూర్: నుస్తులాపూర్ క్యూ లైన్లో పెట్టిన చెప్పులు

- సరిపడా నిల్వలు ఉన్నాయంటున్న అధికారులు
- అయినా దొరకక రైతుల ఆందోళనలు
- ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్నా తిప్పలే
- అవసరానికి మించి అన్నదాతల వినియోగం?
- సాగు విస్తీర్ణం మేరకు ఎందుకివ్వడం లేదనే ప్రశ్న

యూరియా కొరత లేదని యంత్రాంగం చెబుతున్నది. అవసరాన్ని బట్టి ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్నామంటున్నది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా కొరత వెంటాడుతున్నది. ఎక్కడ చూసినా అరకొరగానే అందుతున్నది. సరిపడా యూరియా నిల్వలుంటే తామెందుకు ఆందోళన చేస్తామని రైతాంగం ప్రశ్నిస్తున్నది. అయితే కొరత ఏర్పడిందా..? లేక అంచనా తప్పిందా..? అనే ప్రశ్నలు తెరపైకి వస్తుండగా, యాసంగి సీజన్‌లో యూరియా వాడకం అధికంగా పెరిగిందని చెబుతున్నది.

### ఎవుసం చేసుడా.. బంజేసుడా?



ఎవుసం చేసుడా.. బంజేసుడా? కాంగ్రెస్ సర్కారే చెప్పాలి. రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు ఏమీ ఇస్తలేదు. సన్న వడ్లకు బోనస్, రుణమాఫీ, రైతు బంధు ఇవేవీ ఇవ్వలేదు. నేను మూడెకరాల్లో ఎవుసం చేస్తున్నా. ఎకరానికి ఒక యూరియా బస్తా సరిపోవడం లేదు. రైతులకు కావాల్సినంత అందించాలె. గతంలో ఆధార్ కార్డుతో యూరియా బ్యాగ్ ఇస్తుండె. ఇప్పుడు, ఆధార్ కార్డు, పాస్‌బుక్కు ఇచ్చినా గంటల తరబడి నిల్చుండబెడుతున్నరు. గత పదేళ్లలో ఇంత గోస ఎప్పుడూ లేదు. రైతులను గోస పెట్టుడు ఈ సర్కారుకు మంచిది కాదు.

- సిరికొండ వెంకటి, రైతు, లింగంపేట (జగిత్యాల రూరల్ మండలం)

కరీంనగర్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాల వారీగా పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేసినప్పుడే ఏ పంటకు ఎంత ఎరువు అవసరం అనేది అధికారులు లెక్కలు వేస్తారు. ఆ అంచనా మేరకు యూరియా, పొటాష్, కాంప్లెక్స్ తదితర ఎరువుల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ ఇస్తారు. ఆ ప్రకారమే విడతల వారీగా ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తుంది. ఈ యాసంగి సీజన్‌కు కూడా ఇదే విధంగా కరీంనగర్ జిల్లాకు 42,416 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని ప్రభుత్వానికి నివేదించారు. ఏ నెలలో ఎంత అవసరమో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. దాని ఆధారంగానే ప్రభుత్వం ఎరువులను సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ సీజన్‌లో కరీంగనర్ జిల్లా వ్యాప్తంగా 2.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో 1.80 లక్షల ఎకరాల్లో విత్తన వరి సాగు చేస్తుండగా, దీనిలోనే యూరియా అధికంగా వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం పంట పెరుగుదల దశలో చలితీవ్రత అధికంగా ఉండడంతో వరి ఎదుగుల తగ్గినట్టు తెలుస్తున్నది. ఈ సమయంలో పంట ఎదగాలంటే యూరియా అధికంగా వినియోగించాల్సి వస్తుంది. అలాగే ఈ సారి జిల్లాలో 30 వేల ఎకరాల్లో మక్క సాగు చేస్తుండగా, ఈ పంటకు ఎకరానికి 6 నుంచి 8 బస్తాల యూరియా వినియోగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో యాసంగి సీజన్‌లో అంచనాకు మించి యూరియా వినియోగం పెరిగినట్టు వ్యవసాయశాఖ చెబుతున్నది.

### పొరుగు జిల్లాల నుంచి..

కరీంనగర్ జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు సరిపోకుంటే పొరుగు జిల్లాల నుంచి కూడా తెప్పించి రైతులకు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మొత్తం 42,416 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 38,255 మెట్రిక్ టన్నులు జిల్లా రైతులకు పంపిణీ చేశామంటున్నారు. డీలర్ల వద్ద 1,534 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని అంటున్నారు. జిల్లాలో యూరియా వినియోగం పెరగడంతో కలెక్టర్ పమేలా సత్పతి చొరవ తీసుకుని రెండు మూడు రోజులుగా 1,500 మెట్రిక్ టన్నులు ఇతర జిల్లాల నుంచి తెప్పించారని అధికారులు చెబుతున్నారు. వచ్చిన యూరియా వచ్చినట్టు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలకు సరఫరా చేస్తున్నారు. శనివారం 648 మెట్రిక్ టన్నుల యూరియాను సొసైటీలకు సరఫరా చేశారని డీఏవో భాగ్యలక్ష్మి తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో యూరియా సరఫరా చేస్తుంటే కొరత ఎందుకు వస్తోందనేది అర్థంకాని ప్రశ్న కాగా, రైతులు తమ అవసరానికి మించి యూరియా కొంటున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ పరిస్థితులను నియంత్రించాల్సిన బాధ్యత కూడా అధికారుల పైనే ఉంది. ఏ రైతు ఎంత విస్తీర్ణంలో వరి సాగు చేశారు? ఎంత విస్తీర్ణంలో మక్క వేశారు? ఇతర పంటలు ఎంత సాగు చేశారు? అనేది అంచనా వేసి రైతులకు అవసరమైన మేరకే యూరియా ఇస్తే ఇలాంటి పరిస్థితి ఎందుకు వస్తుందని యూరియా అందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు ఏ పంట ఎన్ని ఎకరాల్లో సాగు చేశారనేది అధికారులు క్రాప్ సర్వే చేసినపుడే వారి పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని, సొసైటీలకు సరఫరా చేసినపుడే రైతులు సాగు చేసిన విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు పంపిణీ చేస్తే ఇలాంటి పరిస్థితి ఉండదని అభిప్రాయపడుతున్నారు.

### ఎక్కువ వాడితే పంటకు నష్టం

క్రమం తప్పకుండా జిల్లాకు యూరియా సరఫరా అవుతున్నది. జిల్లాలో సరిపడా ఎరువులు ఉన్నాయి. అవసరం మేరకు ప్రతి రైతుకూ అందిస్తాం. యూరియా దొరకని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తొందరపడి అవసరానికి మించి కొనుగోలు చేయవద్దు. యూరియా ఎక్కువ మోతాదులో వినియోగిస్తే పంటకు నష్టం వాటిల్లుతుంది. వరిలో చీడ పీడలు పెరిగి దిగుబడి మీద తీవ్ర ప్రభావం చూపుతుంది.

- భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి (కరీంనగర్)



వేదికపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## బీజేపీకి ఓట్లడిగే హక్కు లేదు

కరీంనగర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : బీసీల ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని బీజేపీ విష ప్రచారం చేస్తున్నదని, నిరుద్యోగ యువత కోసం ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానం కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మద్దతుగా సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్రంలో ఆ పార్టీ ఏం చేసిందో చెప్పి పట్టభద్రుల ఓట్లు అడగాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, విప్‌లు అడ్లూరి లక్ష్మన్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మేడిపల్లి సత్యం, ఠాకూర్ మక్కాన్ సింగ్, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

## రాజన్నా.. వస్తున్నం!

నేటి నుంచే మహా శివరాత్రి ఉత్సవాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 24: మహాశివరాత్రి ఉత్సవాలకు వేములవాడ రాజన్న క్షేత్రం సరికొత్త శోభ సంతరించుకున్నది. నేటి నుంచి మూడురోజులపాటు అంత్యంత వైభవోపేతంగా జరిగే వేడుకలకు సుందరంగా ముస్తాబైంది. రాత్రి వేళ విద్యుద్దీపాలతో ఆలయం కాంతులీనుతున్నది. జాతరకు రాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి నాలుగు లక్షల మంది భక్తులు తరలిరానుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. తాగునీరు, వసతి, పారిశుధ్యం, పార్కింగ్ స్థలాలతోపాటు పట్టణంలో ఆరోగ్య కేంద్రాలు, హెల్ప్‌లైన్లను సిద్ధం చేశారు. మంగళవారం రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున రాత్రి 7.30 గంటలకు టీటీడీ అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.



విద్యుత్ వెలుగుల్లో వేములవాడ రాజరాజేశ్వర ఆలయం



పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయ ఆవరణలో బూడిద లారీలకు జరిమానా రాస్తున్న విజిలెన్స్ అధికారులు

## బూడిద ఓవర్‌లోడ్‌పై విజిలెన్స్ కొరడా

- వాహనాల పట్టివేత.. ఆరు ఓవర్‌లోడ్ లారీల సీజ్
- కొనసాగుతున్న తనిఖీలు
- 'నమస్తే' కథనాలతో కదిలిన యంత్రాంగం



సీజ్ చేసిన బూడిద లారీలు

పెద్దపల్లి, ఫిబ్రవరి24 : ఓవర్‌లోడ్‌తో వెళ్తుతున్న బూడిద లారీలపై రోడ్డు రవాణా శాఖ విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. 'ఎన్టీపీసీ యాష్ ఉచితం ఉత్తదే.. 'లోడింగ్ పేరిట దందా? 'బూడిద లారీ పక్కదారి?' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్(ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా నుంచి వెళ్తున్న ఓవర్ లోడ్ బూడిద లారీలను పెద్ద ఎత్తున పట్టుకున్నారు. పరిమితికి మించి వెళ్లడంతోపాటు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాహనాలపై నిఘా పెంచారు. రెండు రోజులుగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 35 లారీలకు జరిమానా విధించారు. సోమవారం విజిలెన్స్ అధికారులు ప్రేమ్‌కుమార్, సురేశ్, సిబ్బంది కలిసి పెద్దపల్లిలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆరు బూడిద లారీలను సీజ్ చేసి జరిమానా విధించినట్టు ఆర్టీవో పీ రంగారావు తెలిపారు. అయితే స్టేట్ విజిలెన్స్ అధికారులు జిల్లా కేంద్రంలో చేసిన తనిఖీలలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. పరిమితికి మించి ఓవర్ లోడ్‌తోపాటు ఫిట్‌నెస్ లేని వాహనాలు సైతం నడుపుతున్నారని అధికారులు గుర్తించారు. వే బిల్లులు లేకుండా బూడిద రవాణా చేస్తున్నారని, ఎలాంటి నంబర్లు లేకుండానే లారీలను నడిపిస్తున్నారని, చాలా మంది లారీ డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని తెలిపారు.

## నల్లా ఆన్ చేసి.. కత్తులతో దాడి చేసి





దుండగుల దాడిలో గాయపడ్డ ప్రతాప రాఘవరెడ్డి, వినోద

- హుజూరాబాద్‌లో భారీ దోపిడీ
- 70 తులాల బంగారం, రూ.7 లక్షల నగదుతో ఉడాయింపు
- దంపతులకు గాయాలు


హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : ఇంటి ముందు నల్లా ఆన్ చేసిన అగంతకులు.. ఆ శబ్దానికి ఇంట్లో నుంచి బయటకు వచ్చిన దంపతులపై కత్తులతో దాడి చేసి భారీ దోపిడీకి ఒడిగట్టారు. 70 తులాల బంగారంతో పాటు రూ.7 లక్షల నగదుతో ఉడాయించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడలో ఆదివారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రతాపవాడకు చెందిన ప్రతాప రాఘవరెడ్డి ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ముగ్గురు దుండగులు ఇంటి ఆరుబయట ఉన్న మోటర్‌ను ఆన్ చేశారు. దీంతో ట్యాంక్ నిండి నీళ్లు బయటికి రావడాన్ని గమనించారు. ఈ సమయంలో మోటర్‌ను ఎవరు ఆన్ చేశారని.. రాఘవరెడ్డి భార్య వినోద ఆఫ్ చేయాలని బయటకు వచ్చేందుకు తలుపు తీయగానే ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి రాఘవరెడ్డితోపాటు అతడి భార్యపై దాడి చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న కూతురు మానస, అలికిడి విని తల్లిదండ్రులను కాపాడేందుకు రావడంతో ఆమె గొంతుపై కత్తి పెట్టి బెదిరించారు. రాఘవరెడ్డిపై కత్తితో దాడి చేసేందుకు రాగా తనను తాను రక్షించుకునేందుకు వారితో కాసేపు తగువులాడుతున్న సమయంలో దుండుగుల కత్తి ఒకటి విరిగిపోయి రాఘవరెడ్డి చేతులకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో వినోదపైనా కత్తులతో దాడి చేశారు. బంగారం డబ్బు ఎక్కడ ఉందంటూ ఆరా తీస్తూ, చెప్పకపోతే అందరిని చంపేస్తామని బెదిరించారు. తమను చంపవద్దని ప్రాధేయపడి, బీరువా తాళం ఇవ్వడంతో బీరువాలోని రూ.7 లక్షల నగదు, 70 తులాల బంగారం దోచుకెళ్లారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. దుండగులు బయటికి వెళ్లేప్పుడు తమని లోపలికి నెట్టేసి బయట గడియ పెట్టారని, వారు వెళ్లగానే మొదటి అంతస్తులో ఉన్న పెద్ద కొడుకు నాగరాజుకి ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో అతడు వచ్చి తీశారని తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం కరీంనగర్ నుంచి క్లూస్ టీం, టెక్నికల్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌ని రప్పించి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ ఘటనలో దగ్గర బంధువుల హస్తం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

# తుది అంకానికి మండలి పోరు

## 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

### నేటి సాయంత్రంతో ముగియనున్న ప్రచారం

- పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు 71 మంది అభ్యర్థులు పోటీ
- ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం



కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు తుది అంకానికి చేరింది. గ్రాడ్యుయేట్ స్థానానికి 56 మంది, టీచర్ స్థానానికి 15 అభ్యర్థులు పోటీ పడుతుండగా, నిన్నటిదాకా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ప్రచారం హోరెత్తింది. నేటి సాయంత్రంతో ప్రచార పర్వానికి తెరపడనుండగా, ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఈనెల 27న ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కరీంనగర్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదలైంది. ఆ రోజు నుంచి ఈ నెల 10 వరకు నామినేషన్లు స్వీకరించగా, 13న ఉపసంహరణ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల లెక్కతేలింది. పట్టభద్రుల స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది బరిలో నిలిచారు. ఈ నెల 27న ఎన్నికలు ఉండగా, అభ్యర్థులంతా ప్రచారంతో హోరెత్తించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికే రెండు విడతలుగా ప్రచారం పూర్తి చేసిన ప్రధాన అభ్యర్థులంతా, మరింత దూసుకెళ్లారు. గెలుపుపై దృష్టి సారించి, నాలుగు ఉమ్మడి జిల్లాలు తిరుగుతున్నారు. నేరుగా ఓటర్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థించారు. టీచర్లు, గ్రాడ్యుయేట్ల మద్దతు కూడగడుతున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం.. నేటి సాయంత్రంతో ప్రచారం ముగియనుండగా, సాధ్యమైనంత మేర ఎక్కువ మంది ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి కొనసాగే సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎలాంటి ప్రచారం చేయకూడదని రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సైలెన్స్ పీరియడ్‌లో జిల్లాయేతర వ్యక్తులు కూడా జిల్లాలో ఉండకూడదని సూచించారు. మండలి ఎన్నికలు ముగిసే దాకా ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు.

### పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 27 పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. మొత్తం 15 జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి 406, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 181 పోలింగ్ కేంద్రాలతోపాటు 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోసం అధికారులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించారు. అంతేకాదు, గంట గంటకూ పోలింగ్ వివరాలను అన్ని కేంద్రాల వద్ద నుంచి తెప్పించేందుకు సిద్ధం చేశారు. అలాగే, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఇతర కార్యాలయాల్లో పనిచేసే వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని సదరు యాజమాన్యాలకు ఆదేశాలిచ్చారు.